# ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా
# విస్తృత ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను సమీక్షించిన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తదితరులు

వికారాబాద్, నవంబర్ 22 : జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈ.సీ.ఐ) సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యలపై ఆయా జిల్లాలవారీగా కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం

ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ఓటింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను ఇప్పటికే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో సగటున 82 శాతం పంపిణీ పూర్తి చేశామని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయిందని.. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు 830 మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మరో రెండు రోజుల్లో ప్రత్యేక పోలింగ్ బృందాల ద్వారా మిగిలిన వారందరికీ హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

### ఈసీ నిబంధనలకు అనుగుణంగా చర్యలు

ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడుతలుగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే ఫెసిలిటేషన్ సెంటర్లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసులు సహా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలను ఈసీ దృష్టికి తెచ్చేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చిన సీ.విజిల్ యాప్ గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. జిల్లా స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్

### అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని ఈ.సీ.ఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్ హితవు పలికారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణన్, ఎక్స్పెండీచర్ నోడల్ అధికారి శంకరాచారి, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రారావు, జిల్లా హార్టికల్చర్ అధికారి చక్రపాణి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
### రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ

ఇబ్రహీంపట్నం : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ అన్నారు. నితేశ్‌వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామని చెప్పారు. ఓటింగ్ వివరాలతో కూడిన స్లిప్పులను జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పంపిణీ చేశామన్నారు. ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయిందని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికిపైగా వైకల్యం ఉన్న దివ్యాంగులను కలుపుకొని మొత్తం 1,968 మంది ఓట్ ఫ్రం హోం సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామని, వారి ఇండ్ల వద్దకే వెళ్లి ఓటును స్వీకరించేందుకు ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 21 వరకు 1,792 మంది ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకోగా, 1,520 మంది పోలీసు సిబ్బంది పోస్టల్‌బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారన్నారు.

### ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం

ఈసీ నిబంధనలకనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన సీ విజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. జిల్లాస్థాయిలోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటికోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సీపీవో దిలీప్‌కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది సైదులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భారతి హోలీకేరీ

# నేడు వికారాబాద్‌కు కేసీఆర్ రాక

- బ్లాక్ గ్రౌండ్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనంద్


సభాస్థలిని నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, నవంబర్ 22 : సీఎం కేసీఆర్ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ విజయానికి కృషి చేయనున్నారు. ఈ సభకు వికారాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. సుమారు 50 వేల మందికి సరిపోయే టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాట్లు చేశారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా వికారాబాద్‌లోని మిషన్ గ్రౌండ్‌లో దిగుతారు. అక్కడి నుంచి కారులో బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు హాజరవుతారు. స్టేజిపై దాదాపు 100 మందికిపైగా కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సభ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు.

### సభను విజయవంతం చేయాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం వికారాబాద్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రానున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కేసీఆర్ ప్రతి నియోజకవర్గంలో ఆశీర్వాద సభ నిర్వహించి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రజా ఆశీర్వాద సభ ఉంటుందని తెలిపారు. సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గయాజ్, కౌన్సిలర్ అనంత్ రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, టైగర్ కృష్ణయ్య, దేవదాసు, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి మాటలను నమ్మొద్దు
### ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రహీముల్లాఖాన్

షాద్‌నగర్, నవంబర్ 23 : రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరోమారు మోసపోతామని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రహీముల్లా ఖాన్ అన్నారు. బుధవారం సాయంత్రం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్ కోసమే వాడుకుంది తప్పా ఏనాడైనా మన అభివృద్ధి కోసం ఆలోచించిందా? అనే విషయాన్ని తెలుసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ పాలనలో ముస్లింలకు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో పాటు విద్యార్థుల బాగు కోసం వేల కోట్ల నిధులను వెచ్చిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మైనార్టీల కోసం గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేశారని, విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మందికి పైగా ముస్లింలకు షాదీ ముబారక్ పథకం అందిందని చెప్పారు.జేపీ దర్గా అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులను కేటాయించిందని చెప్పారు. అంజయ్య యాదవ్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్, షాద్‌నగర్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 3,453 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- హోమ్ ఓటింగ్ ద్వారా ఈ నెల 21 వరకు 1,792 మంది ఓటు హక్కు వినియోగం
- ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తి
- ఎన్నికల విధుల్లో 15,212 మంది సిబ్బంది
- తనిఖీల్లో రూ.148,98,98,473 కోట్ల నగదు, మద్యం, బంగారు సీజ్
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ

రంగారెడ్డి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ సెగ్మెంట్ల పరిధిలో 1419 ప్రాంతాల్లో 3,453 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లలో 80 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్లు 43,775 మంది ఉండగా.. 40 శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులు 45,102 మంది ఉన్నారని తెలిపారు. వీరు ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా ఫారం–12(డి) పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. సీక్రెట్ ఓటింగ్ కోసం ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 21 వరకు 1,792 మంది ఓటు హక్కును హోమ్ ఓటింగ్ ద్వారా, పోలీస్ సిబ్బంది 1,520 మంది ఓటు హక్కును పోస్టల్ బాలెట్ ద్వారా వినియోగించుకున్నారన్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ కల్పించబడదని స్పష్టం చేశారు.

### ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా (రిజర్వు) బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను కేటాయించినట్లు వివరించారు. జిల్లాలో అన్ని సెగ్మెంట్లను కలుపుకొని 280 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారని తెలిపారు. 31 మంది నామినేషన్ల తిరస్కరణ, 40 మంది ఉపసంహరణ చేసుకోగా.. 209 మంది బరిలో ఉన్నారని, వారికి గుర్తులను కేటాయించినట్లు చెప్పారు.

ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ చేపట్టి కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా పూర్తి చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం రెవెన్యూ డివిజన్ల వారీగా ఇప్పటికే పీఓలు, ఏపీఓలు, ఓపిఓలకు శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. మైక్రోఅబ్జర్వర్లు 283 మంది, పీఓలు 3,803 మంది, ఏపీఓలు 3,803, ఓపీఓలు 7,606 లు కలుపుకుని మొత్తం 15,212 మందిని పోలింగ్ విధుల కోసం ర్యాండమైజేషన్ ద్వారా బాధ్యతలు కేటాయించామని తెలిపారు. ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు, ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు వీలుగా 270 సెక్టార్లను ఏర్పాటు చేస్తూ ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను నియమించామని, అనునిత్యం 24 గంటలపాటు ఈ బృందాలు నిఘా ఉంచుతాయన్నారు. నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతికతో కూడిన పీటీజెడ్ కెమెరాలను నిఘా బృందాల వాహనాలకు అమర్చినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది అంతర్ జిల్లా చెక్ పోస్టుల వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

తనిఖీల సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు నగదు, మద్యం, బంగారం కలుపుకొని రూ.148,98,98,473లను సీజ్ చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను నియమిస్తామన్నారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా 403 ఫిర్యాదులు అందాయని, మొత్తం ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. 1950 టోల్ ఫ్రీ, కంట్రోల్ రూంలకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు.